క్లుప్తంగా

విద్యార్థులకు నగదు ప్రోత్సాహం

పుట్రేల(విస్సన్నపేట): మండలంలోని పుట్రేల జిల్లా పరిషత్ హైస్కూల్‌లో పదో తరగతిలో ఉత్తమ మార్కులు సాధించిన విద్యార్థులకు ఏఎంసీ మాజీ చైర్మన్ మద్దిరెడ్డి సూర్యనారాయణ రెడ్డి బుధవారం నగదు ప్రోత్సాహకాలు అందజేశారు. కంపా సోపి 547, పొన్నూరి యోగితా 520, బెజ్జం హర్షవర్ధన్‌లు 519 మార్కులు సాధించారు. వారిని అభినందించి నగదు ప్రోత్సాహం అందజేశారు. కార్యక్రమంలో సర్పంచ్ కారుమంచి స్వాతి, బడుగు భాస్కర రావు, బెజ్జం అశోక్, కొలికపోగు ఏషయా, వంగేటి మోహనరావు పాల్గొన్నారు.

జేవీవీ సభ్యత్వ నమోదు



తిరువూరు: సైన్స్ పరిశోధనా ఫలాలను సామాన్యులకు అందించడంలో జన విజ్ఞాన వేదిక విశేష కృషి చేస్తోందని తిరువూరు నగర పంచాయతీ కమిషనర్ లోవరాజు అన్నారు. బుధవారం నగర పంచాయతీ కార్యాలయంలో జేవీవీ సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని ఆయన ప్రారంభించారు. సభ్యత్వ నమోదు ప్రచార వాల్‌పోస్టర్లను ఆవిష్కరించిన అనంతరం కమిషనర్ మాట్లాడుతూ సమాజంలో మూఢనమ్మకాలు పారదోలడంలో జేవీవీ కృషి ప్రశంసనీయమని చెప్పారు. జేవీవీ జిల్లా ప్రధాన కార్యదర్శి ఎల్. గంగాధర్, ఉపాధ్యక్షుడు ఎం. హరికృష్ణ, సభ్యులు రాంప్రదీప్, పాపారావు, సుధాకర్, సుదర్శన్, సుబానీ, వెంకటస్వామి, నరసింహారావు పాల్గొన్నారు.

ఇళ్ల స్థలాలు మంజూరు చేయాలని జర్నలిస్టుల ధర్నా

ఇబ్రహీంపట్నం: అర్హులైన జర్నలిస్టులకు ఇళ్ల స్థలాలు మంజూరు చేయాలని కోరుతూ ఏపీ డబ్ల్యూజేఎఫ్ మైలవరం నియోజకవర్గ కమిటీ ఆధ్వర్యంలో ఇబ్రహీంపట్నం తహసీల్దార్ కార్యాలయం వద్ద బుధవారం ధర్నా నిర్వహించారు. ఇళ్ల స్థలాలు, నూతన అక్రిడిటేషన్‌లు మంజూరు చేయాలని నినాదాలు చేశారు. డిమాండ్స్‌తో కూడిన వినతిపత్రాన్ని డెప్యూటీ తహసీల్దార్ సాయి మహేష్‌కు అందజేశారు. ప్రజా సమస్యలపై వార్తలు రాస్తున్న జర్నలిస్టులపై దాడులు చేస్తున్న వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని కోరారు. ఏపీడబ్ల్యూజేఎఫ్ నాయకులు ఎ.బాబు, అడపా శివ, సత్య, బొమ్మ గోపి, మేకల భాను, సీహెచ్ రాంబాబు తదితరులు పాల్గొన్నారు.

అభివృద్ధి పనులు ప్రారంభం

రాయనపాడు(విజయవాడరూరల్): అభివృద్ధి అనేది నిరంతర ప్రక్రియ అని ఎమ్మెల్యే వసంత వెంకట కృష్ణ ప్రసాద్ అన్నారు. బుధవారం రాయనపాడు గ్రామంలో రూ. 60 లక్షలతో నిర్మించిన సీసీ రోడ్డు, డ్రెయిన్‌ను, రాయనపాడు ఆర్అండ్‌బీ రోడ్డు నుండి కొత్తూరు తాడేపల్లి గ్రామానికి నిర్మించిన బీటీ రోడ్డును, రూ. 16 లక్షలతో నిర్మించిన అంగన్‌వాడీ భవనాన్ని ఎమ్మెల్యే వసంత వెంకట కృష్ణ ప్రసాద్ ప్రారంభించి మాట్లాడారు. సర్పంచి కాటంనేని కల్యాణి, ఎంపీడీఓ బి.విగ్గీన్స్, స్థానిక నాయకులు పాల్గొన్నారు.

వేంకటాచలస్వామికి లక్ష మల్లెలతో అర్చన

తిరువూరు: జ్యేష్ఠ పౌర్ణమి సందర్భంగా తిరువూరులోని వేంకటాచల స్వామికి బుధవారం లక్ష మల్లెలతో విశేషార్చనలు చేశారు. ఆలయ ప్రధానార్చకులు దేవయాజనం వేణుగోపాలాచార్యులు ఆధ్వర్యంలో శ్రీదేవీ భూదేవి సమేత వేంకటాచలస్వామికి ప్రత్యేక అలంకరణ, అష్టోత్తర, సహస్ర నామాలతో అర్చన చేశారు. వైష్ణవ గోష్ఠి సభ్యులు స్వామి వారి సేవా కార్యక్రమంలో పాల్గొన్నారు.

రవిప్రసాద్‌కు అభినందన

ముసునూరు: వైఎస్సార్ సీపీ గుళ్లపూడి గ్రామ అధ్యక్షుడిగా సీనియర్ నేత, వలసపల్లి వ్యవసాయ సొసైటీ మాజీ డైరెక్టర్ మండలపు రవి ప్రసాద్ నియమితులయ్యారు. పార్టీ ఆవిర్భావం నుంచి మాజీ ఎమ్మెల్యే మేకా వెంకట ప్రతాప్ అప్పారావుకు ముఖ్య అనుచరుడిగా ఉన్న ఆయన్ను గ్రామ పార్టీ అధ్యక్ష పదవికి ఎన్నుకోవడంపై పలువురు హర్షం వ్యక్తం చేశారు. రవిప్రసాద్‌ను పలువురు నేతలు అభినందించారు.

హెల్మెట్ ధారణతో సురక్షిత ప్రయాణం

ఆగిరిపల్లి: హెల్మెట్ ధరించి వాహనాలు నడపడం సురక్షితమని ఎస్ఐ శుభశేఖర్ అన్నారు. బుధవారం విజయవాడ రోడ్డులో వాహనాలను తనిఖీ చేసి ద్విచక్ర వాహనదారులకు హెల్మెట్ వాడకంపై అవగాహన కల్పించారు. హెల్మెట్ వాడకం వలన ప్రమాదాల తీవ్రత తగ్గి ప్రాణాలు నిలబడతాయని, హెల్మెట్ తప్పనిసరిగా ధరించాలని వాహనదారులకు సూచించారు. నిబంధనలను అతిక్రమిస్తే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు.

కారును ఢీకొట్టిన లారీ

గుంటుపల్లి(ఇబ్రహీంపట్నం): మండలంలోని గుంటుపల్లి రమేష్ నగర్ వద్ద 65వ నంబర్ జాతీయ రహదారిపై బుధవారం రోడ్డు ప్రమాదం జరిగింది. గుంటుపల్లి సెక్టార్ ఎస్ఐ విజయలక్ష్మి తెలిపిన వివరాల ప్రకారం.. విజయవాడ నుంచి పెనుగంచిప్రోలు వెళుతున్న కారును వెనుక వైపు నుంచి వచ్చిన లారీ ఢీ కొట్టింది. ఈ ప్రమాదంలో కారులో ఉన్న వ్యక్తులకు ఎటువంటి గాయాలు కాకపోవడంతో ఊపిరి పీల్చుకున్నారు. కారు పాక్షికంగా దెబ్బతింది. కారు డ్రైవర్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

ఏడాదిగా ఎదురుచూపులే!

- ఒక్క పింఛన్ కూడా మంజూరు కాని వైనం
- దరఖాస్తు చేసుకునేందుకు సచివాలయాల చుట్టూ ప్రదక్షిణలు
- వెబ్‌సైట్ ఓపెన్ కావడం లేదంటూ సమాధానం
- గత వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలో అర్హులందరికీ పింఛన్లు



నూజివీడు ఏరియా ఆస్పత్రిలో రీ వెరిఫికేషన్ కోసం వేచి ఉన్న దివ్యాంగ పింఛన్లు పొందుతున్న లబ్ధిదారులు (ఫైల్)

నూజివీడు: కూటమి ప్రభుత్వం ఏర్పాటై ఏడాది గడిచినా నేటి వరకు ఒక్క నూతన పింఛన్ మంజూరు చేసిన దాఖలాలు లేవు. నూతన పింఛన్‌ల కోసం దరఖాస్తు చేసుకునేందుకు అర్హులైన వృద్ధులు, వితంతువులు, దివ్యాంగులు గ్రామాల్లో సచివాలయాల చుట్టూ ఏడాదిగా ప్రదక్షిణలు చేస్తున్నారు. ప్రభుత్వం కనీసం దరఖాస్తు చేసుకునేందుకు అవకాశం కూడా లేకుండా వెబ్‌సైట్‌ను ఓపెన్ చేయడం లేదు. ఎప్పుడు ఓపెన్ అవుతుందో కూడా అధికారులకు తెలియని పరిస్థితులు నెలకొన్నాయి. వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలో ఉన్న పింఛన్‌లు తప్ప కూటమి ప్రభుత్వం వచ్చాక కొత్తగా ఒక్క పింఛన్ ఇచ్చిన దాఖలాలు లేవు.

వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలో ఏడాదికి రెండు సార్లు

గత వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలో ఏడాదికి రెండు సార్లు నూతన పింఛన్లను మంజూరు చేసేవారు. జనవరి నుంచి మే వరకు దరఖాస్తు చేసుకున్న అర్జీదారులకు జూన్‌లో, జూన్ నుంచి డిసెంబరు వరకు దరఖాస్తు చేసుకున్న అర్హులకు జనవరిలో మంజూరు చేసి వారికి నగదును అందజేసేవారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత ఏడాది గడిచినా ఒక్క నూతన పింఛన్‌ను మంజూరు చేయలేదు. దీంతో పింఛన్ కోసం అర్హత సాధించిన వారు దరఖాస్తు చేసుకునేందుకు వెబ్‌సైట్‌ను ఎప్పుడు ఓపెన్ చేస్తారా అని ఎదురు చూస్తున్నారు.

భర్త చనిపోతే భార్యకు పింఛను

ప్రస్తుతం పింఛన్ తీసుకుంటూ భర్త చనిపోతే భార్యకు స్పౌజ్ కోటా కింద వితంతు పింఛన్‌ను మంజూరు చేస్తున్నారు. దీనిపై భర్త పింఛన్‌నే భార్యకు బదలాయించి ప్రభుత్వం చేతులు దులుపుకుంటోందనే విమర్శలు వ్యక్తమవుతున్నాయి. వృద్ధాప్య, దివ్యాంగ పింఛన్‌లను మంజూరు చేయడం లేదు.

50 ఏళ్లు దాటిన ఎస్సీ, ఎస్టీ, బీసీలకు పింఛన్లు ఏవి?

ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీలకు 50 ఏళ్లకే పింఛన్ ఇస్తామని ఎన్నికలకు ఏడాది ముందు నుంచి కూటమి నాయకులు ఊదరగొట్టారు. తీరా అధికారంలోకి వచ్చాక ఆ ఊసే ఎత్తడం లేదు. కూటమి నాయకుల మాటలను నమ్మి ఓట్లు వేసి గెలిపిస్తే తమకు తగిన గుణపాఠం చెప్పారని ఆయా వర్గాల వారు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

దివ్యాంగుల పింఛన్ల వెరిఫికేషన్

ఇదిలా ఉండగా గత ఐదారు నెలలుగా దివ్యాంగ పింఛన్ల వెరిఫికేషన్‌ను ప్రభుత్వం నిర్వహిస్తోంది. దీనిలో భాగంగా చెవుడు, గుడ్డి, మూగ, ఆర్థో తదితర వైకల్యంతో దివ్యాంగ పింఛన్‌ను పొందుతున్న లబ్ధిదారులకు నూజివీడులోని ఏరియా ఆసుపత్రిలో రీ వెరిఫికేషన్‌ను నిర్వహిస్తున్నారు. దీంతో లబ్ధిదారుల్లో ఆందోళన వ్యక్తమవుతోంది. ఎవరి పింఛన్ ఉంటుందో, ఎవరిది ఊడుతుందో తెలియని పరిస్థితి నెలకొంది. చాలా మంది దివ్యాంగులు, ఇతరులు పింఛన్ సొమ్ము మీదనే ఆధారపడి జీవిస్తున్నారు.

నూతన పింఛన్‌లు మంజూరు చేయాలి



కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత ఒక్క నూతన పింఛన్‌ను మంజూరు చేయలేదు. అర్హత ఉన్నవారందరూ పింఛన్ కోసం ఎదురు చూస్తున్నారు. అధికారంలో లేనప్పుడు ఒక రకంగా, అధికారంలో ఉన్నప్పుడు మరో రకంగా వ్యవహరించడం సమంజసం కాదు. ఎన్నికల ముందు ఇచ్చిన హామీలను నెరవేర్చాల్సిన బాధ్యత ప్రభుత్వంపై ఉంది.

– జి. రాజు, సీపీఎం నాయకులు

రహదారుల అభివృద్ధికి ప్రాధాన్యం

మంత్రి కొలుసు పార్థసారథి



చాట్రాయి: గ్రామాల్లోని రహదారుల అభివృద్ధికి ప్రభుత్వం ప్రాధాన్యత ఇస్తోందని రాష్ట్ర గృహ నిర్మాణ శాఖ మంత్రి కొలుసు పార్థసారథి అన్నారు. మండలంలో రూ.2 కోట్ల నాబార్డు నిధులతో జనార్దనవరం తుమ్మగూడెం బీటీ రోడ్డు నిర్మాణానికి బుధవారం ఆయన శంకుస్థాపన చేశారు. అనంతరం ఏరువాక కార్యక్రమాన్ని ప్రారంభించి జిల్లాలో రూ.3 కోట్లతో 875 మంది రైతులకు వ్యవసాయ యంత్ర పరికరాలు అందజేశామని చెప్పారు. ఇటీవల గాలివాన బీభత్సానికి దెబ్బతిన్న గృహాలను పరిశీలించారు. పోతనపల్లి గ్రామంలో పిడుగు పడి మృతిచెందిన అబ్బదాసరి శాంత కుమారి కుటుంబాన్ని ఆయన పరామర్శించారు.

14 నుంచి బస్‌పాస్‌ల జారీ

తిరువూరు: ఈ నెల 12 నుంచి ప్రారంభం కావలసిన ఆర్టీసీ బస్ పాస్‌ల జారీ రెండు రోజులు వాయిదా పడినట్లు తిరువూరు డిపో మేనేజర్ సుబ్రహ్మణ్యం తెలిపారు. ఆర్టీసీ సాఫ్ట్‌వేర్ ఆధునికీకరణలో భాగంగా బస్‌పాస్ వెబ్‌సైట్ అందుబాటులో ఉండదని, 14వ తేదీ నుంచి తిరిగి పాస్‌ల జారీ ప్రారంభమవుతుందని చెప్పారు.

పూడిక తీత పనుల్లో టీడీపీ నేత అత్యుత్సాహం

ఎస్టిమేషన్‌లు, అనుమతులు లేకుండానే పనులు ప్రారంభం



గంగినేని వద్ద పులివాగులో పూడిక తీత పనులు ప్రారంభిస్తున్న టీడీపీ నాయకులు



గంగినేని వద్ద పులివాగులో జరుగుతున్న పూడిక తీత పనులు

జి.కొండూరు: పులివాగు పూడిక తీత పనులకు ఎస్టిమేషన్‌లు, అధికారుల నుంచి ఎటువంటి అనుమతులు లేకుండానే పనులను ప్రారంభించి టీడీపీ నేత అత్యుత్సాహాన్ని ప్రదర్శిస్తున్నారు. జి.కొండూరు మండల పరిధి గంగినేని గ్రామంలో గత ఏడాది ఆగస్టులో వచ్చిన వరద ప్రవాహానికి పులివాగును ఆనుకొని ఉన్న ఇళ్లు ముంపునకు గురయ్యాయి. ఈ వరదలకు గ్రామానికి చెందిన ఒక వ్యక్తి కూడా మరణించాడు. ఈ క్రమంలో పులివాగులో పూడిక తీస్తే కొంతమేర వరద ముంపును తగ్గించవచ్చని సర్పంచ్ పిల్లి రామారావు, ఎంపీటీసీ సభ్యుడు పిల్లి ప్రసాదు భావించారు. పూడికతీత పనుల కోసం మండల పరిషత్ నిధులు రూ.5 లక్షలు కేటాయించాలని అధికారులకు దరఖాస్తు చేశారు. ఈ నిధుల విడుదల కోసం మండల పరిషత్ సమావేశంలో తీర్మానం చేయాల్సి ఉంది.

అధికారం మాదే.. మేమే చేయాలి

విషయం తెలుసుకున్న గ్రామానికి చెందిన టీడీపీ నాయకుడు మండల పరిషత్ సమావేశంలో తీర్మానం చేయకుండా, ఎటువంటి అనుమతులు జారీ కాకుండానే సోమవారం పనులను ప్రారంభించారు. వైఎస్సార్ సీపీకి చెందిన సర్పంచ్, ఎంపీటీసీ సభ్యుడు ఊళ్లో పనులు చేస్తే తాను చూస్తూ ఊరుకోవాలా అంటూ తన పార్టీ అధికారంలో ఉన్నప్పుడు గ్రామంలో ఏది చేసినా తానే చేయాలంటూ పూడికతీత పనులను మొదలు పెట్టినట్లు తెలుస్తోంది.

అనుమతులు లేవు: ఎంపీడీఓ

దీనిపై ఎంపీడీఓ రామకృష్ణనాయక్‌ని వివరణ కోరగా పూడికతీత పనులకోసం అనుమతి, అంచనాల కోసం ఇరిగేషన్ శాఖకు దరఖాస్తు చేశామన్నారు. ఇరిగేషన్ శాఖ నుంచి అంచనాలు, అను మతి వచ్చిన తర్వాత మండల పరిషత్ సమావేశంలో తీర్మానం చేయాల్సి ఉందన్నారు. ఆ తర్వాత తాను పనుల కోసం నిధులు మంజూరు చేస్తానని చెప్పారు. ఇప్పటి వరకు ఎటువంటి అనుమతులు జారీ చేయలేదన్నారు.

మట్టి అక్రమ రవాణాను అడ్డుకున్న రైతులు



ఓబులాపురం గ్రామంలో మట్టి లారీలను అడ్డుకుంటున్న గ్రామస్తులు, జనసేన నాయకులు

జి.కొండూరు: కోర్టు ఆదేశాలతో సీజ్ చేసిన మట్టిని రాత్రి సమయంలో గుట్టుచప్పుడు కాకుండా ఇటుక బట్టీలకు తరలిస్తున్న క్రమంలో రైతులే నేరుగా రంగంలోకి దిగి అడ్డుకున్న ఘటన రెడ్డిగూడెం మండల పరిధి ఓబులాపురం గ్రామంలో బుధవారం రాత్రి జరిగింది. ఓబులాపురం గ్రామంలో నాగసానిపాటి చెరువు నుంచి 2022లో తొమ్మిది వందల లారీల మట్టిని తరలించి ఇటుక బట్టీల కోసం గ్రామానికి చెందిన కొప్పుల చిన్న వీరారెడ్డి వ్యవసాయ భూమిలో డంపు చేశారు. ఈ అంశం కోర్టులో ఉండగానే గ్రామానికి చెందిన టీడీపీ నాయకుడు ఎటువంటి అనుమతులు లేకుండా బుధవారం రాత్రి లారీలతో మట్టిని మైలవరం మండల పరిధి వెల్వడంలో ఇటుక బట్టీలకు తరలిస్తున్నారు. ఒక్కొక్క లారీ మట్టిని రూ.10 వేలకు విక్రయిస్తున్నట్లు తెలుస్తోంది. దీనితో గ్రామానికి చెందిన రైతులు మట్టి లారీలను అడ్డుకొని పోలీసులకు సమాచారం అందించారు. లారీలను అడ్డుకున్న రైతులకు మద్దతుగా జనసేన నాయకులు కూడా వచ్చారు. ఆయకట్టు రైతుల పొలాలకు మెరక లేదా రైతుల అవసరాలకు తరలించాల్సిన మట్టిని అక్రమ మార్గంలో బట్టీలకు తరలించి ఒకరిద్దరు నాయకులు సొమ్ము చేసుకోవడం దుర్మార్గమని రైతులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

చికిత్స పొందుతూ వ్యక్తి మృతి



సిగిరెడ్డి నగేష్ మృతదేహం

జి.కొండూరు: అప్పు తీర్చలేననే భయంతో పురుగుమందు తాగి ఆత్మహత్యా యత్నం చేసిన వ్యక్తి చికిత్స పొందుతూ మృతి చెందాడు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. అనకాపల్లి జిల్లా, నక్కవరం మండలం, రేబాక గ్రామానికి చెందిన సిగిరెడ్డి నగేష్ (32) తన భార్య సిగిరెడ్డి పద్మ, ఒక కుమార్తె, కుమారుడితో కలిసి చేగిరెడ్డిపాడు గ్రామంలో నిర్వహిస్తున్న నాటుకోళ్ల ఫారంలో పనిచేసేందుకు కొన్ని రోజుల కిందట వచ్చారు. అయితే ఆర్థిక ఇబ్బందులతో సతమతమవుతున్న నగేష్ తన కున్న రూ.3 లక్షల అప్పుని తీర్చలేనేమోననే భయంతో ఈ నెల ఏడున పురుగుమందు తాగి ఆత్మహత్యాయత్నం చేశాడు. ఈ క్రమంలో కుటుంబ సభ్యులు నగేష్‌ని విజయవాడలోని ప్రభుత్వాస్పత్రిలో చేర్పించగా చికిత్స పొందుతూ బుధవారం ఉదయం మృతి చెందాడు. మృతుడి భార్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ సతీష్‌కుమార్ తెలిపారు.

మైలవరం నియోజకవర్గ అభివృద్ధిపై ప్రణాళిక

ఎంపీ కేశినేని శివనాథ్



సమావేశంలో మాట్లాడుతున్న కేశినేని శివనాథ్

భవానీపురం(విజయవాడపశ్చిమ): మైలవరం నియోజకవర్గ అభివృద్ధికి ప్రణాళిక సిద్ధమైందని, త్వరలో ముఖ్యమంత్రి చంద్రబాబుకు డాక్యుమెంటేషన్ అందజేస్తామని విజయవాడ ఎంపీ కేశినేని శివనాథ్ (చిన్ని) అన్నారు. స్థానిక ఎమ్మెల్యే వసంత వెంకట కృష్ణప్రసాద్ ఆధ్వర్యంలో బుధవారం గొల్లపూడిలోని దత్త కల్యాణ మండపంలో స్వర్ణాంధ్ర విజన్–2047లో భాగంగా మైలవరం నియోజకవర్గ అభివృద్ధిపై వివిధ శాఖల అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఎంపీ మాట్లాడుతూ కృష్ణానదీ తీర ప్రాంతమైన చినలంకలో టూరిజం ప్రోగ్రాం కింద బోటింగ్ ఏర్పాటు చేయాలన్నారు. కొండపల్లి రైల్వేస్టేషన్‌ను కూడా త్వరలో శాటిలైట్ స్టేషన్‌గా అభివృద్ధి చేసేందుకు కృషి చేస్తానని చెప్పారు. మైలవరం నియోజకవర్గంలో అగ్రికల్చర్, హార్టీకల్చర్, టూరిజం, స్పోర్ట్స్ వంటి పలు విభాగాల అభివృద్ధికి అవకాశం ఉందన్నారు. ఎమ్మెల్యే వసంత కృష్ణప్రసాద్ మాట్లాడుతూ కొండపల్లి ఖిల్లాతోపాటు కొండపల్లి బొమ్మలకు మరింత ప్రాచుర్యానికి, పవిత్ర సంగమం అభివృద్ధికి కృషి చేస్తామని చెప్పారు. వారం రోజుల్లో విజన్ డాక్యుమెంటేషన్ ప్రతిపాదనలు రూపొందించి ప్రభుత్వానికి నివేదిస్తామన్నారు. సమావేశంలో కూటమి నాయకులు పాల్గొని పలు సూచనలు చేశారు.

తటాకాన్ని తలపిస్తున్న జంక్షన్ రోడ్డు



నూజివీడు పట్టణం జంక్షన్ రోడ్డులోని బీఎస్ఎన్ఎల్ కార్యాలయం వద్ద రహదారి దుస్థితి

నూజివీడు: పట్టణంలోని హనుమాన్ జంక్షన్ రోడ్డులో బీఎస్ఎన్ఎల్ కార్యాలయం వద్ద ప్రధాన రహదారి తటాకాన్ని తలపిస్తోంది. బుధవారం తెల్లవారు జామున భారీ వర్షం కురిసింది. డ్రెయినేజీలన్నీ పూడుకుపోవడంతో వర్షం నీరు వెళ్లడానికి వీలు లేక రోడ్డుపైకి చేరడంతో తటాకాన్ని తలపిస్తోంది. దీనికి తోడు మొఘల్ చెరువులోని మురుగు నీరంతా రోడ్డుపైకి వస్తుండటంతో దుర్వాసన వెదజల్లడంతో పరిస్థితి మరింత దారుణంగా మారింది. ఆక్రమణలన్నీ తొలగించి డ్రెయినేజీలోని పూడికను తొలగించినట్లయితే ఈ పరిస్థితి ఉండదని స్థానికులు పేర్కొంటున్నారు.

సమన్వయంతో పనిచేస్తేనే గ్రామాల అభివృద్ధి

ఎంపీడీఓ చెన్నా రాఘవేంద్రనాథ్



మాట్లాడుతున్న ఎంపీడీఓ రాఘవేంద్రనాథ్

నూజివీడు: మండలంలోని అధికారులందరూ సమన్వయంతో పనిచేస్తేనే గ్రామాల అభివృద్ధి సాధ్యమని ఎంపీడీఓ చెన్నా రాఘవేంద్రనాథ్ అన్నారు. మండల పరిషత్ కార్యాలయంలో అధికారులతో బుధవారం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. కేంద్ర ప్రభుత్వం ధాత్రి అబా అభియాన్ కింద వెంకటాయపాలెం, సిద్దార్థ్ నగర్ గ్రామాలను ఎంపిక చేసిందన్నారు. ఈ గ్రామాల్లో కేంద్ర ప్రభుత్వ పథకాలను లైన్ డిపార్ట్‌మెంట్స్ ద్వారా అందరికీ అందించాలన్నారు. ఆయా గ్రామాల్లో సంబంధిత స్థాయిల్లో అన్ని ప్రభుత్వ పథకాలను అమలు చేయడానికి తీసుకోవాల్సిన చర్యలపై పలు సూచనలు చేశారు. ప్రతి కుటుంబానికి ప్రభుత్వ సంక్షేమ పథకాలు అందేలా చర్యలు తీసుకోవాలన్నారు. ఎంఈఓ సేవియా నాయక్, ఏఎస్‌డబ్ల్యూఓ శ్రీనివాసరావు, ఆర్ఐ అశోక్, ఇతర శాఖల అధికారులు పాల్గొన్నారు.

మినీ గోకులం షెడ్డు ప్రారంభం

గుంటుపల్లి(ఇబ్రహీంపట్నం): గుంటుపల్లి గ్రామంలో ఉపాధి హామీ పథకంలో రాయితీపై రైతులు నూతనంగా నిర్మించుకున్న మినీ గోకులం షెడ్డును నందిగామ పశు సంవర్ధక శాఖ డీడీ మోజెస్ వెస్లీ సర్పంచి బి.కవితతో కలిసి బుధవారం ప్రారంభించారు. పశువుల యజమానుల ప్రయోజనార్థం ప్రభుత్వం మంజూరు చేస్తున్న గోకులం షెడ్లను పాడి రైతులు సద్వినియోగం చేసుకోవాలని వారు కోరారు. కార్యక్రమంలో గుంటుపల్లి పశు సంవర్ధక శాఖ వైద్యశాల లైవ్‌స్టాక్ అసిస్టెంట్ పూర్ణిమ, ఉపాధి హామీ పథకం ఇంజినీర్ సతీష్‌చంద్ర, గ్రామ పంచాయతీ కార్యదర్శి జి.మునేశ్వరరావు, పశు సంవర్ధక శాఖ సిబ్బంది పాల్గొన్నారు.

ఖరీఫ్ కార్యాచరణపై అవగాహన

తిరువూరురూరల్: వికసిత కృషి సంకల్ప్ అభియాన్ ఖరీఫ్ కార్యాచరణ కార్యక్రమంలో భాగంగా లక్ష్మీపురం, కాకర్ల, మునుకుళ్ల గ్రామాల్లో కృషి విజ్ఞాన్ కేంద్రం ఆధ్వర్యంలో బుధవారం అవగాహన కార్యక్రమాలు నిర్వహించారు. భూసార పరీక్ష ఆధారిత ఎరువుల వాడకం, జీవన ఎరువుల ప్రాముఖ్యత, సేంద్రియ ఎరువుల ప్రయోజనాలు, పచ్చిరొట్ట ఎరువులు, ఖరీఫ్‌కు అనువైన వరి రకాలను గురించి కేవీకే ప్రధాన శాస్త్రవేత్త పి. కిశోర్ వర్మ వివరించారు. వరిలో, పత్తిలో కొత్త వంగడాలు, కలుపు నివారణ, మామిడిలో పురుగులు, తెగుళ్ల నివారణపై అవగాహన కల్పించారు. శాస్త్రవేత్తలు డాక్టర్ ఆశాజ్యోతి, రాజప్ప, రాజశేఖర్‌రెడ్డి, మహేశ, జస్వంత్‌రెడ్డి, పీఎస్ శివప్రసాద్, లక్ష్మీకళ, తిరువూరు, ఎ.కొండూరు మండల వ్యవసాయాధికారులు పద్మ, టిప్పుసుల్తాన్ తదితరులు పాల్గొన్నారు.

రైతుల భూములకు ఎన్‌ఓసీ జారీ చేయాలి

భవానీపురం(విజయవాడపశ్చిమ): మైలవరం నియోజకవర్గ పరిధిలోని దేవాలయాల సమస్యలపై స్థానిక ఎమ్మెల్యే వసంత కృష్ణప్రసాద్ దేవదాయ శాఖ కమిషనర్ రామచంద్రమోహన్‌కు వినతిపత్రం అందజేశారు. బుధవారం గొల్లపూడిలోని దేవదాయ, ధర్మాదాయ శాఖ కార్యాలయానికి వెళ్లిన వసంత కృష్ణప్రసాద్ కమిషనర్ రామచంద్రమోహన్‌ను కలిశారు. నియోజకవర్గ పరిధిలోని పలు దేవాలయాల అభివృద్ధికి నిధులు మంజూరు చేయాలని కోరారు. వెల్లటూరు శివారు భీమవరప్పాడులో రైతులకు చెందిన 20 ఎకరాల భూములకు సంబంధించి ఎన్‌ఓసీ ఇవ్వాలని విజ్ఞప్తి చేశారు. బొమ్మసాని సుబ్బారావు, బొర్రా తిరుపతిరావు తదితరులు పాల్గొన్నారు.

తిరువూరు తహసీల్దార్‌గా ఉదయభాస్కర్‌రావు

తిరువూరు: తిరువూరు తహసీల్దార్‌గా మాచిరాజు ఉదయ భాస్కర్‌రావు నియమితులయ్యారు. ఏలూరు జిల్లా నూజివీడు రెవెన్యూ డివిజనల్ అధికారి కార్యాలయంలో అడ్మినిస్ట్రేటివ్ అధికారిగా పనిచేస్తున్న ఆయనను బదిలీపై తిరువూరు తహసీల్దార్‌గా నియమించారు. బుధవారం ఆయన బాధ్యతలు చేపట్టారు. సిబ్బంది ఆయనకు స్వాగతం పలికారు.

మూడు పొక్లెయిన్లు సీజ్

విజయవాడరూరల్: విజయవాడ రూరల్ మండలం కొత్తూరు చెరువులో మట్టి తవ్వకాలు చేస్తున్న మూడు ప్రొక్లెయిన్లను జిల్లా కలెక్టర్ జి. లక్ష్మీశ ఆదేశాల మేరకు మైనింగ్, రెవెన్యూ అధికారులు బుధవారం సీజ్ చేశారు. చెరువులో ఏ మేరకు మట్టి తవ్వకాలు జరిగాయో కొలతలు తీసి ఆ మేరకు జరిమానా విధించాలని ప్రభుత్వం ఆదేశించింది. వర్షం కురిసి చెరువులో నీరు నిలవడంతో చెరువులో కొలతలు తీయడం సాధ్యం కాక కొలతలు తీయలేదు. ఇరిగేషన్ శాఖకు చెందిన కొత్తూరు చెరువులో అనుమతులు లేకుండా స్థానిక అధికార పార్టీ నాయకులు గత ఆరు రోజులుగా రేయింబవళ్లు మూడు పొక్లెయిన్లతో చెరువు మట్టిని తవ్వి అక్రమంగా విక్రయించారు. చెరువు మట్టిని బుడమేరు కాల్వ గండ్లు పూడ్చడానికి అనుమతులు కోరిన అధికార పార్టీ నాయకులు నామమాత్రంగా గండ్ల వద్దకు తోలి, అధిక మొత్తంలో మట్టిని అమ్ముకున్నారు. ప్రభుత్వం నుంచి అనుమతులు ఇంత వరకు రాకపోవడం గమనార్హం.

వేణుగోపాలుడికి మాస కల్యాణం

తిరువూరు: గంపలగూడెం మండలం నెమలిలోని వేణుగోపాలస్వామి దేవస్థానంలో జ్యేష్ఠ పౌర్ణమి సందర్భంగా బుధవారం స్వామివారి మాస కల్యాణం నిర్వహించారు. స్వామివారికి అర్చకులు విశేష పూజలు నిర్వహించిన అనంతరం 16 మంది దంపతులు పీటలపై కూర్చుని స్వామివారి కల్యాణోత్సవాన్ని జరిపించారు. ఆలయ సహాయ కమిషనర్ జయప్రకాష్ పర్యవేక్షించారు.

పాఠ్యపుస్తకాల పంపిణీ

చాట్రాయి: మండలంలోని అన్ని ప్రభుత్వ పాఠశాలలకు పాఠ్య పుస్తకాలు పంపిణీ చేశామని ఎంఈఓ బ్రహ్మాచారి తెలిపారు. బుధవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ మండలంలో 63 పాఠశాలల్లో 2,610 మంది విద్యార్థులకు గాను 12,743 నోటు పుస్తకాలు, 14,500 బ్యాగులు వచ్చాయని చెప్పారు. మధ్యాహ్న భోజనం నిమిత్తం 5,325 కిలోల బియ్యం, 124 కిలోల రాగి పిండి, 125 కిలోల బెల్లం వచ్చిందన్నారు.

నేడు న్యాయ విజ్ఞాన సదస్సు

నూజివీడు: న్యాయసేవాధికార సంస్థ ఆధ్వర్యంలో న్యాయ విజ్ఞాన సదస్సు గురువారం ఆగిరిపల్లి మండలం వట్టిగుడిపాడులోని స్పిన్నింగ్ మిల్లులో నిర్వహిస్తామని మండల న్యాయ సేవాధికార సంస్థ చైర్మన్, 15వ అదనపు జిల్లా జడ్జి ఎ. నాగశైలజ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. సాయంత్రం 5 గంటలకు నిర్వహించనున్న న్యాయ విజ్ఞాన సదస్సులో ప్రజలు పాల్గొనాలని కోరారు.

ఖిల్లాను సందర్శించిన ఎన్‌సీసీ క్యాడెట్లు

కొండపల్లి(ఇబ్రహీంపట్నం): కేతనకొండ సీబీఆర్ అకాడమీలో నిర్వహిస్తున్న గుంటూరు 10వ ఆంధ్ర బాలికల బెటాలియన్ ఎన్‌సీసీ క్యాంపు బుధవారం ఐదో రోజుకు చేరింది. ఎన్‌సీసీ క్యాడెట్లు కొండపల్లి ఖిల్లాను సందర్శించారు. అక్కడి పురాతన కట్టడాలు, వాటి విశిష్టతను తెలుసుకున్నారు. క్యాడెట్ల ఫైరింగ్ ప్రాక్టీస్‌ను సుబేదార్ షేక్ ఇమామ్ సాహెబ్, లెఫ్టినెంట్ బి.లత నిర్వహించారు. విపత్తుల సమయంలో ఎటువంటి జాగ్రత్తలు తీసుకోవాలి, వాటి నివారణ మార్గాలపై ఇన్‌స్పెక్టర్ నాగేంద్రసింగ్ యాదవ్ పలు సూచనలు చేశారు. క్యాంప్ సూపరింటెండెంట్ కొల్లా రాజశేఖర్‌బాబు పాల్గొన్నారు.

ఏరువాక ప్రారంభం

తిరువూరు: ఏరువాక పౌర్ణమి సందర్భంగా తిరువూరు నియోజకవర్గంలో ఖరీఫ్ సాగు పనులను ఎమ్మెల్యే కె. శ్రీనివాసరావు బుధవారం ప్రారంభించారు. మండలంలోని కాకర్లలో రైతులతో కలిసి ఎద్దులు, నాగళ్లకు పూజాదికాలు నిర్వహించారు. వ్యవసాయాధికారులు, రైతులు పాల్గొన్నారు. అనంతరం ఎ.కొండూరు కస్తూరిబా గాంధీ బాలికా విద్యాలయంలో మధ్యాహ్న భోజన పథకాన్ని పరిశీలించారు. ఎ.కొండూరు మండలం రామచంద్రాపురంలో ఎన్ఆర్ఈజీఎస్ నిధులతో నిర్మించిన పశువుల షెడ్‌ను ప్రారంభించారు. గంపలగూడెం మండలం పెదకొమెరలో సీసీ రహదారిని ప్రారంభించారు.